క్లుప్తంగా

కోడ్ ఉల్లంఘించొద్దు

రుద్రవరం: ప్రభుత్వ,ప్రైవేటు కార్యాలయాలతో పాటు ఎక్కడా ఎన్నికల కోడ్ ఉల్లఘించరాదని తహసీల్దార్ మురళీమోహన్ హెచ్చరించారు. సోమవారం ఆయన స్థానిక గ్రామ సచివాలయాలను సందర్శించి కోడ్ ఉల్లంఘనలపై ఆరా తీశారు. అలాంటివి ఏవీ లేక పోవడంతో ఉద్యోగుల హాజరు పట్టిక, ఇతర రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలను తనిఖీ చేశారు.

నివాళి

చాగలమర్రి: మండలంలోని కలుగొట్లపల్లె మజరా నగళ్ళపాడు గ్రామానికి చెందిన రామస్వామిరెడ్డి (55) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సోమవారం గ్రామానికి చేరుకొని, మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జగజ్జననీమాతకు కుంకుమార్చన



అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని జగజ్జననీ ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం భక్తులు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. అంతకు ముందు భక్తులు తీసుకొచ్చిన వివిధ రకాల పండ్లతో ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. సాయంత్రం ప్రదోష పూజలు జరిపించారు. భక్తులకు దుర్గాఫ్రెండ్స్ యూనిట్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

గోస్పాడు: మండలంలోని ఒంటివెలగల గ్రామంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగఅనసూయ తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు గోస్పాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుల ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందించనున్నారని, స్థానికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాండురంగస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

నంద్యాల(అర్బన్): మండలంలోని పాండురంగాపురం గ్రామంలో వెలసిన శ్రీరుక్మిణీ సమేత పాండురంగస్వామికి సోమవారం తెప్పోత్సవం, హారతి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు, మూలమంత్ర అనుష్టానములు, అర్చనలు, సాయంత్రం సాయంకాల ప్రదోష పూజలు, అన్నాభిషేకం, సహస్ర నామార్చాన, తీర్థప్రసాదాల వినియోగం చేపట్టారు. మంగళవారం సాయంత్రం 7:30 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణమహోత్సవం జరిపిస్తామని నిర్వాహకులు తెలిపారు.

పోలీసుల అనుమతి తప్పనిసరి

దొర్నిపాడు: మండలంలో మార్కెట్, మాన్యం వేలాలు నిర్వహించాలనుకుంటే సంబంధిత వ్యక్తులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ సురేష్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జాతర, ఆలయాల ప్రతిష్ట, మార్కెట్ వేలం పాటలు ఇలా ఏ కార్యక్రమైనా పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. అలాగే గ్రామాల్లో ప్రస్తుతం పంటలు కోత కాలం ముగిసినందున పుల్లరి పాటలు వివాదాస్పదం కాకుండా తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎవరైనా కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నోటిఫికేషన్ వరకు కొత్త ఓటర్ల నమోదు

శిరివెళ్ల: ఎన్నికల నామినేషన్ ప్రక్రియ వరకు కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం కొనసాగుతుందని తహసీల్దార్ కులశేఖర్ సోమవారం తెలిపారు. ఓటర్ల తుది జాబితా అనంతరం మండలంలో కొత్తగా 543 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. నియమావళి అమలును ఎంపీడీఓ పర్యవేక్షిస్తారని చెప్పారు. సెక్టోరియల్ ఆఫీసర్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్ విధుల్లో చేరారన్నారు. త్వరలో చెక్ పోస్టుల ఏర్పాటు చేస్తామని, సభలు, సమావేశాలు, ర్యాలీలకు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. అనుమతుల కోసం కమిషన్ ప్రత్యేకంగా ఓ యాప్‌ను ఏర్పాటు చేసిందని, యాప్ ద్వారానే అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.



రైతు భరోసా కేంద్రం



వైఎస్సార్ హెల్త్ క్లీనిక్



నిర్మాణంలో డెయిరీ కేంద్ర భవనం



బాలికల మోడల్ స్కూల్ హాస్టల్ భవనం

వికసించిన గ్రామ స్వరాజ్యం

- గ్రామంలోనే అన్ని రకాల ప్రభుత్వ సేవలు
- అందంగా రూపుదిద్దుకున్న మిట్నాల గ్రామ సచివాలయ సముదాయం
- జగనన్న పాలనలో రూ.15కోట్లతో గ్రామాభివృద్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



ఒకేచోట ఏర్పాటైన ప్రభుత్వ భవనాలు



రూ.1.25 కోట్ల వ్యయంతో చేపట్టిన మిట్నాల-ఏ.శివరాంపురం రహదారి పనులు

నంద్యాల(అర్బన్): జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. అందులో భాగంగా గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, జగనన్న పాల వెల్లువ డెయిరీ, వైఎస్సార్ హెల్త్‌క్లీనిక్‌లు ఒకే చోట ఏర్పాటు కావడంతో అన్ని సేవలు ప్రజలకు పల్లె ముంగిటనే అందుతున్నాయి. గ్రామ సచివాలయ భవన సమీపంలో రూ.5.60 కోట్ల వ్యయంతో మోడల్ స్కూల్, బాలికలకు హాస్టల్ భవనాలతో పాటు రూ.60 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టారు.

సచివాలయ సముదాయం సేవలు..

2వేల మంది జనాభాకు దాదాపు 14 మంది ప్రభుత్వ ఉద్యోగులను నియమించి పరిపాలనలో అవినీతి, వివక్షతకు తావులేకుండా పాలనను ప్రజల చెంతకు చేర్చాలని సచివాలయ వ్యవస్థను రూపొందించారు. అలాగే ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీరు నియమించి దాదాపు 15 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 500కు పైగా సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. అలాగే రైతు భరోసా కేంద్రం ద్వారా ప్రభుత్వం ధ్రువీకరించిన నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. వ్యవసాయానికి సంబంధించి అత్యుత్తమ విధానాలు, సహజ పద్ధతుల్లో సాగు వంటి వాటిపై రైతులకు శిక్షణ ఇస్తున్నారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ద్వారా గ్రామంలోనే ఒక వైద్యాధికారి అక్కడే నివాసం ఉంటూ 24 గంటల పాటు ప్రజలకు వైద్య సేవలు అందిస్తారు. ఏదైనా అత్యవసరమైతే ప్రథమ చికిత్స చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తారు. జగనన్న పాల వెల్లువ మహిళా డెయిరీ సహకార సంఘం ద్వారా గ్రామంలోనే పాడి రైతులకు కావలసిన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచి పాడి రైతుకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు చేపట్టారు. మండల కేంద్రాల్లోని కార్యాలయాలు చుట్టూ తిరగకుండా గ్రామంలోనే అన్ని రకాల సేవలు ఒకే చోట అందుతుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మిట్నాల గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు

- ➡ పౌర సేవలు ప్రజలకు అందించేందుకు వీలుగా రూ.42.500 లక్షలతో గ్రామ సచివాలయం నిర్మాణం
- ➡ రైతులకు స్థానికంగా సేవలు అందించేందుకు వీలుగా రూ.30 లక్షలతో రైతు భరోసా కేంద్రం ఏర్పాటు
- ➡ నాడు-నేడు కింద రూ.48 లక్షలతో ప్రాథమికోన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన
- ➡ రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం
- ➡ రూ.1.25 కోట్ల వ్యయంతో మిట్నాల-ఏ. శివరాంపురం రహదారి పనులు
- ➡ రూ.5.60 కోట్ల వ్యయంతో మోడల్ స్కూల్, బాలికల వసతి గృహం పూర్తి.
- ➡ రూ.60 లక్షల స్వచ్ఛభారత్ నిధుల వ్యయంతో 80 మరుగుదొడ్లు ఏర్పాటు
- ➡ 80మందికి జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణాలు
- ➡ రూ.45లక్షలతో వాటర్ ట్యాంకు ఏర్పాటు



మిట్నాల బీసీ కాలనీలో ఏర్పాటైన సీసీ రోడ్డు

పథకాలు పక్కాగా అమలు



నవరత్నాలతో పాటు ఇతర పథకాలు క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలయ్యేందుకు సచివాలయాలు ఎంతగానో తోడ్పడుతున్నాయి. గ్రామ వలంటీర్ల సహకారంతో సచివాలయాల ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరుతున్నాయి. అమ్మఒడి, రైతు భరోసా, సున్నా వడ్డీ, పింఛన్లు తదితర వాటిని సచివాలయాలు ద్వారానే పేదలకు అందుతున్నాయి. –గోపాల్‌రెడ్డి, మిట్నాల

లబ్ధిదారుల్లో సంతోషం



సచివాలయ సేవలు అందుబాటులోకి వచ్చాక అర్హులకు పథకాలు అందుతున్నాయి. ఇంటికే పథకాలు అందిస్తుండటంతో లబ్ధిదారులు ఎంతో సంతోషంగా ఉన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సచివాలయాలు ఎంతో దోహదపడుతున్నాయి. మండల కార్యాలయాలు చుట్టూ తిరిగే పని లేకుండా గ్రామంలోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతున్నాయి. ఇలాంటి పనుల వల్ల ప్రజలకు జీవితకాలం ఇబ్బందులు తప్పుతాయి. –తిరుపతిరెడ్డి,గ్రామస్తుడు



ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన యువత

మాట తప్పని నాయకుడు జగనన్న

- టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన యువత
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే గంగుల

ఆళ్లగడ్డ: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి మాట మీద నిలిచే నాయకుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఖ్యాతిగాంచారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో పట్టణానికి చెందిన టీడీపీ, బీజేపీకి చెందిన కార్యకర్తలు సుదర్శనాచారి, కల్యాన్‌బాబు, సిద్దు, భార్గవ, నాగేంద్ర, మద్దిలేటి, సామేల్, మున్నాఫ్, మన్సూర్, మబూషరీఫ్ వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా సైనికుల్లా పనిచేయాలని సూచించారు.

పది పరీక్షలు ప్రారంభం



ఉయ్యాలవాడ పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

రుద్రవరం: మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి.రెండు కేంద్రాల్లో మొత్తం 467 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 417 మంది రాశారని, 50 మంది గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా రెండు పరీక్ష కేంద్రాలైన స్థానిక జెడ్పీ ఉన్నత,నర్సాపురం ఎస్టీ మార్తోమా పాఠశాలల వద్దకు విద్యార్థులు తల్లిదండ్రులు,కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు.విద్యార్థులు కేంద్రాల లోపలికి వెళ్లి పరీక్ష రాసి బయటకు వచ్చే వరకు వారంతా బయటే వేచి ఉన్నారు. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉయ్యాలవాడ : మండల కేంద్రంలో పదవ తరగతి పరీక్షలు తొలి రోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మొదటి రోజు తెలుగు పరీక్షకు స్థానిక మోడల్‌స్కూల్ పరీక్షా కేంద్రంలో మొత్తం 249 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 235 మంది హాజయ్యారని చీఫ్ సూపర్‌వైజర్ వెంకటశకుంతల తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థులను పరీక్షా కేంద్రానికి గంట ముందు తీసుచ్చి, వారు పరీక్ష రాసి వచ్చే వరకు ఆరుబయట చెట్ల కింద సేదతీరారు.

శిరివెళ్ల: మండలంలో 4 పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షలు పోలీస్ బందోబస్తు మధ్య ప్రారంభమయ్యాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, యర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ఏ, బీ సెంటర్లలో 543 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. సీఐ చంద్రబాబు, ఎస్ఐ సురేష్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి పర్యవేక్షించారు. డిప్యూటీ ఈఓ మహమ్మద్‌బేగ్ కేంద్రాలను తనిఖీ చేసి వసతులపై కేంద్రాల చీఫ్‌లతో ఆరా తీశారు.

గోస్పాడు: పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాలు అధికారులు ఏర్పాటు చేశారు. దీబగుంట్ల హైస్కూల్‌లో 199మంది హాజరు కావాల్సి ఉండగా 185 మంది, యాళ్లూరు హైస్కూల్‌లో 86 కు 77మంది, గోస్పాడు మోడల్ స్కూల్‌లో 162 మందికి 152 మంది విద్యార్థులు, గోస్పాడు హైస్కూల్‌లో 145 మందికి 138 మంది తెలుగు పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ అబ్దుల్‌కరీం వివరించారు.

దొర్నిపాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. 250 మంది విద్యార్థులకు గాను తొలి రోజు 18 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రాజు తెలిపారు. డిపార్టుమెంటల్ ఆఫీసర్‌గా శాస్త్రి వ్యవహరించారు.



దొర్నిపాడు పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

వెదురు తరలిస్తున్న ఆటో పట్టివేత



ఆళ్లగడ్డ కలప డిపోలో ఉంచిన ఆటో

రుద్రవరం: నల్లమల అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా వెదురు తరలిస్తున్న ఆటోను అధికారులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. అహోబిలానికి చెందిన కొందరు వ్యక్తులు అటవీ ప్రాంతంలో వెదురును సేకరించి సోమవారం ఉదయాన్నే ఆటోలో వేసుకొని ఆళ్లగడ్డ వైపు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న ఫారెస్టు సెక్షన్ అధికారి శ్రీనివాసరెడ్డి సిబ్బందితో హరినగరం సమీపంలోని సాయిబాబ మందిరం వద్ద మాటు వేసి ఆటో అక్కడికి రాగానే దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వెదురు ఆటోను రుద్రవరంలోని కలప డిపోకు తరలించకుండా నిబంధనలకు విరుద్ధంగా ఆళ్లగడ్డ పట్టణంలోని కలప డిపోలో ఉంచారు. ఈ విషయంపై రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతినాయుడును వివరణ కోరగా.. ఆటోను ఆళ్లగడ్డకు తీసుకెళ్లిన విషయం వాస్తవమేనని, కేసు నమోదు చేశామని.. ఇక మీదట ఏదైనా పట్టుబడినప్పుడు తప్పనిసరిగా రుద్రవరం అటవీ కార్యాలయానికే తరలించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తాం



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరమణ

ఉయ్యాలవాడ : సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు వెలువడిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అసిస్టెంట్ మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి (తహసీల్దార్) వెంకటరమణ తెలిపారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ నిర్వహణ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాల్లోనున్న రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లు, ఫొటోలు, క్యాలెండర్లు, జెండాలను తొలగించాలని సూచించారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు. ఎంపీడీఓ రఘురాం, డిప్యూటీ తహసీల్దార్ తులసీకృష్ణ, ఆర్ఐ సత్తార్ పాల్గొన్నారు.

దొంగలు బాబోయ్..

రుద్రవరం: మండలంలో కొద్ది రోజుల నుంచి దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు పల్లెలో వివిధ రకాల దొంగతనాలకు పాల్పడుతున్నారు. దీంతో రైతులు, ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.నిన్న,మొన్నటి వరకు వ్యవసాయ మోటర్లకు సంబంధించిన కేబుల్ తీగలు, స్టార్టర్ బాక్సులను తస్కరించేవారు. అలాగే పాత వస్తువులు సేకరించే పేరుతో రైతులు భద్రపరచుకున్న విద్యుత్ సామగ్రిని ఎత్తుకెళ్లేవారు. ఇటీవల మందలూరులో అలాంటి వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కాగా రెండు రోజుల నుంచి రాత్రి సమయాల్లో కోళ్లను ఎత్తుకెళ్తున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న మేదరి హరికి చెందిన దాదాపు రూ.70 వేల విలువజేసే నాటు కోళ్లను శనివారం రాత్రి ఎత్తుకెళ్లారు. అలాగే మాచినేనిపల్లె, కొండమాయపల్లె గ్రామాల్లో ఆదివారం రాత్రి నాటు కోళ్లను ఎత్తుకెళ్లారు. పోలీసులు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వేలంలో పంచాయతీకి ఆదాయం

నంద్యాల(అర్బన్): పంచాయతీ గేట్ల వేలం పాటల్లో కానాల మేజర్ పంచాయతీకి రూ.1.77 లక్షల ఆదాయం వచ్చింది. సోమవారం గ్రామంలో నిర్వహించిన వేలం పాటల్లో నలుగురు పాటదారులు పాల్గొనగా గ్రామానికి చెందిన పట్టాల దాదాబాషా రూ.1.77 లక్షలకు దక్కించుకున్నారు. ఇప్పటికే రెండు విడతలుగా వాయిదా పడిన పంచాయతీ గేట్ల వేలాన్ని డీఎల్‌పీఓ రాంబాబు, ఈఓఆర్డీ మహీధర్‌రెడ్డి, సర్పంచ్ బావమ్మ, పీఎస్ నరేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. రూ.5వేల ధరావత్తు చెల్లించి నలుగురు పాటదారులు పాల్గొన్న వేలాల్లో దాదాబాషా రూ.1.77లక్షలకు దక్కించుకున్నారు. కాగా.. గతేడాది రూ.1.65 లక్షలకు వేలం పలికింది. టిప్పర్లు, లారీల లోడ్, అన్‌లోడ్‌తో పాటు ట్రాక్టర్లతో మట్టి, రాళ్లు, కూరగాయల గంపలు, కోత మిషన్లు తదితరాలపై పన్ను వసూలు చేసే అధికారం పాటదారుడికి ఉంటుందని అధికారులు తెలిపారు.

అహోబిలం బ్రహ్మోత్సవాలకు ఫలహారం బండి



ఫలహారం బండిని ఊరేగిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): అహోబిలంలో జరిగే నారసింహుడి బ్రహ్మోత్సవాల సందర్భంగా నంద్యాల మూలసాగరం నుంచి ఫలహారం బండిని సోమవారం సాయంత్రం భక్తులు ఎద్దుల బండిపై ఊరేగించారు. నిర్వాహకులు మాట్లాడుతూ అహోబిలంలో జరిగే బ్రహ్మోత్సవాలకు గత కొన్నేళ్లుగా మూలసాగరం నుంచి లారీలో సరుకులను తీసుకెళ్లి దిగువ అహోబిలంలో భక్తులకు అన్నదాన ఏర్పాట్లు చేస్తారని చెప్పారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

నంద్యాల(అర్బన్): పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని నంద్యాల అర్బన్ ప్రాజెక్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నజీర, సుజాత తెలిపారు. పట్టణంలోని తిక్కస్వామి దర్గా అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ్ ఉత్సవాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత లేకుండా ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు వినియోగించాలని చెప్పారు. చిన్నారులకు సీజనల్ ఫ్రూట్స్, రాగిమాల్ట్ తదితరాలు అందించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన కొండప్పనాయుడు

రుద్రవరం: మండలంలోని కోటకొండ సమీపంలో సోమవారం ఆటో, మోటర్ సైకిల్ ఢీ కొన్న ఘటనలో కొండప్ప నాయుడు (55) మృతి చెందాడు. ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా కావలికి చెందిన కొండప్ప కొంత కాలంగా గాజులపల్లె మెట్ట మీద నివాసముంటున్నాడు. ఊరూరు తిరిగి ప్లాస్టిక్ పట్టలు విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. ఇందులో భాగంగానే ఎల్లావత్తుల వైపు పట్టల వ్యాపారం ముగించుకొని గాజులపల్లెకు తిరిగి వెళ్తుండగా ప్రమాదవశాత్తూ.. ఎదురుగా వచ్చిన ఆటో ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఎస్ఐ చెప్పారు.

అసభ్యకరంగా పోస్టులు చేసిన వ్యక్తికి దేహశుద్ధి

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో ఆయుష్ యోగా కేంద్రంలోని మహిళా సభ్యులపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్ట్ చేసిన వ్యక్తికి సోమవారం దేహశుద్ధి చేశారు. టూటౌన్ సీఐ రాజారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన పలువురు మహిళలు టౌన్‌హాల్ పక్కనున్న యోగా కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్నారు. మహిళలందరూ శిక్షణలో భాగంగా సంగీతానికి అనుగుణంగా నాట్యం చేస్తుంటారు. అయితే స్థానిక సంజీవనగర్‌లో బుక్‌స్టోర్ నడుపుతున్న వెంకటేశ్వర బాబు మహిళలకు తెలియకుండా యోగా కేంద్రంలోకి చొరబడి వారు డ్యాన్స్ చేస్తుండగా అసభ్యంగా వీడియోలు చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడమే కాకుండా నిర్వాహకుడిపై నింద మోపాడు. వాటిని చూసి మనస్థాపానికి గురైన మహిళలు వెంకటేశ్వరబాబు ఇంటి వద్దకు వెళ్లి మూకుమ్మడిగా దాడి చేశారు. ఆ తర్వాత స్థానిక టూటౌన్‌కు తరలించి పోలీసులకు అప్పజెప్పి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

దైవంపై నమ్మకంతోనే దీక్ష

నంద్యాల(వ్యవసాయం): అల్లాపై నమ్మకంతో ముస్లింలు రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష చేస్తారని వక్తలు పేర్కొన్నారు. నంద్యాల జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక క్యాంపస్ హైస్కూల్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా ఏపీటీఎస్ క్రిస్టియన్ జేఏసీ కన్వీనర్ పాస్టర్ మన్నెం జానయ్య, మాజీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఆకలితో దైవాన్ని ఆశ్వాదించడమే రోజా (ఉపవాస) అన్నారు.